# క్షణంలో సగం-

పెళ్ళయిం తర్వాత కొంతకాలం వరకూ భార్యా భర్తల్లో ఆకర్షణ మిగిలి వుంటుంది. అవి క్రమంగా తగ్గి "విధిలేక" కలిసి వుంటూవుంటారు దంపతులు. ఇలాంటిది చాలామటుకు సహజం. దీనికి వ్యతిరేకంగానూ-చాలా అరుదుగా చాలాకాలం అక్కడక్కడ భార్యా భర్తలు ప్రబలమైన ఆకర్షణ కలిగివుండడంకద్దు. నిజానికి ఇలాంటి దంపతుల్ని ఎంత "ఛాందస" సమాజికులైనాగానీ అభినందించక మానరు. ఐతే ఈ మధ్య వార్తా పత్రికల్లో ఓ వార్తచూసి చాలా ఆశ్చర్యపడ్డాను. ఒకానొక దంపతిద్వయం, పరదాగా తిరనాళకెళ్లారు. అంతా తిరిగారు. చివరకి రంకులరాట్నం ఎక్కారు. వాళ్ళకి పెళ్ళయి ఎంతకాలమైందో మనకైతే తెలీదుగాని, వార్తలో ఉదహరింపబడిన ఉదంతాన్ని బట్టి వాళ్ళలో ఆకర్షణ చాలా నవ్యంగావుందనే భావించాలి మనం. రంకులరాట్నంలో తిరుగుతూ, ఒకరినొకరు ఆకర్షణవల్ల ఏర్పడే వుద్రేకం పట్టలేకనేగావును, హఠాత్తుగా ముద్దెట్టుకున్నారు; అవును. ఆ వందలాది జనసమూహం మధ్యనే! ఎంతగొప్ప ప్రేమో, ఆకర్షణో, మనకెట్లా తెలుస్తుంది. అక్కడ నీతిని కాపాడ్డానికోసం వున్న పోలీసులు యీ "పబ్లిక్ న్యూసెన్సు" కేసును పట్టుకుని విచారణకు పెట్టారు మేజిస్ట్రేట్ యెదుట. ఆయన చాలా గొప్పవేదాంతి అయినా ఐవుండాలి. లేదా, తనజీవితంలో ఎవర్నీ ప్రేమించి- గాఢమైన అనుభూతిని పొంది వుండక పోవాలి; లేదా భార్యంటేభయపడే బాపత్తు ఐనా కావాలి. ఎందుకనంటే ఆ ధర్మాధికారి, తన ఎదటకి తేబడిన ఈ దంపతుల్ని, "మీరు వుత్సవ సందర్భంలో ముద్దెట్టుకుని అక్కడి వాతావరణాన్ని కలుషితం చేసారు; కనక మీకు ఆరువారాలశిక్ష విధిస్తున్నాను" అన్నారు; "నేరస్థులు" క్షమించమని కోరుతున్నాసరే వినిపించుకోకుండా. ప్రపంచ మొత్తంమీద ఏ దేశంలోనూ, భారతదేశంలోనైనా, దాక్షిణాత్య రాష్ట్రాల్లోనూ- ఇలాంటివిచారణ, శిక్షవిధించడం జరగదు. ఈ ఇరవైయో శతాబ్దంలో

రచన:

"శారద"


ఔత్తరాహుల ఛాందసానికి ఇదివొకమచ్చుతునక. ఇంకో దేశంలోఐతే ఆ విచారణాధికారి- ఆదంపతులు ఇంకా అంత ఆకర్షణతోటి దాంపత్యం నెరపుతున్నందుకు వాళ్లని అభినందించి పంపివుండేవారు. ఇంతకీ ఇది పవిత్ర భారతదేశమాయెను!

\+ + +

ఇటీవల కర్నూలులో మన మంత్రులలో ఒకరు మాట్లాడుతూ, "ఆంధ్రులు హిందీని వ్యతిరేకించడం లేదు" అన్నారు. నిజమే. ఆంధ్రులం, ఇటలీ, జర్మనీ హిందీ, పంజాబీ, మొదలైన ఏ అన్యభాషనైనా నేర్చుకోటానికి నిరభ్యంతరంగా సిద్ధపడతాం. వాటిల్లో అనన్యపాండిత్యం సంపాయిస్తాం. ఆలాకాకపోతే, దాక్షిణాత్యులైన మనం ఈ నాడు, కేంద్రప్రభుత్వం వారి అనేక శాఖలలో ముఖ్యం విదేశశాఖల్లో ఉండడం సంభవించేదేకాదు; మనం అన్యభాషలపట్ల చూపించే "ప్రేమ" పాటి మాతృభాషపట్లగూడా చూపించాలి. ఇలా ఎందుకంటున్నానంటే, ఇకముందు హిందీ వస్తేనేగాని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు లభించవని దళ త్వరలోనే ఒకటి రాబోతున్న సూచన మొన్నటి కేంద్రప్రభుత్వ మంత్రి గోవింద వల్లభపంత్ గారి ఉపన్యాసంలోధ్వనిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సర్వీస్ కమీషన్ పరీక్షకు ప్రవేశార్హతగా "హిందీ" వుండాలంటూన్నారు. మొన్నటిదాకా ప్రాంతీయ భాషలవారు "ఆంగ్లం" దండయాత్రతోటి బాధపడ్డారు. ఆంగ్లం వొచ్చినవార్ని మనం తెలుగులో ఎంత పాండిత్యం వున్నవారమైనా సరే పూజించి "నైవేద్యాలు" "సమర్పించుకోవల్సివొచ్చేది; ఆ దుస్థితి పరప్రభుత్వం పరిపాలన అంతమవడంతోటి తప్పుతుందనుకొన్నాం. కాని వారి అడుగుజాడల్లోనే కలుషిత వాతావరణం అంతం కాకముందే "హిందీ" భాషావాదులు తయారై-"సరిగ్గా ఆ పరిస్తితి నే" ప్రాంతీయభాషా ప్రజలకు కల్పించటానికి సిద్ధమౌన్నారు. హిందీని బలవంతంగా నేర్పము" అని ఒక వంక బుజ్జగిస్తూనే "ఉద్యోగపు ఆశ" వుంటే హిందీ నేర్చుకోవాలి సుమా!" అనినెత్తికెక్కుతున్నారు. ఈ పద్ధతే శ్రీ సి. రాజగోపాలాచారివంటి హిందీ అభిమానికికూడా ఆగ్రహం తెప్పిస్తున్నది.

మన తెలుగు మంత్రిగారన్నట్టు మనం హిందీ వ్యతిరేకులం కాకపోవచ్చుగాక. ప్రత్యక్షంగానో పరోక్షంగానో (ఉద్యోగపు ఆశలు) మాతృ భాషలకు ప్రాముఖ్యత తగ్గించి హిందీని ప్రవేశపెట్టడం శ్రేయస్కరం కాదు. ఈ బలవంతాన్ని ఏ ప్రాంతీయ భాషాపౌరుడూ సహించబోడు.

నిజం ఆలోచిస్తే "హిందీ" ఏప్రాంతీయ భాషకంటే గూడా ఏవిధంగా గొప్పదేకాదు! కాకపోతే ఎక్కువ జనాభా మాట్లాడుతున్నారని "అంచనాల" నిపుణులనడం తప్ప. (ఈ అంచనాలు ఎలా తీశారో ఎవరికీ తెలియదు) జాతీయమైన ఓభాష వుండవల్సిందేనని మాటవరుసకు మనం అంగీకరించినా, ఈ జాతీయ భాషా వ్యాప్తికి నిర్ణయించబడిన గడువు ఏమాత్రం చాలదు. ఇప్పుడిప్పుడే పరభాషా దాస్యంనుండి కోలుకుంటున్న ప్రాంతీయ భాషలు ఇంకా పరిపుష్టి పొందాలంటే మళ్ళీ మరొక భాషను నిర్బంధంగా నేర్చుకోవల్సిన దుర్గతి పట్టరాదు. స్కూళ్ళల్లో హిందీలోకూడా 35 మార్కులు వస్తేనే ఉత్తీర్ణుల్ని చేస్తాం అని బెదిరించరాదు. హిందీని ప్రేమతోటి, సహనంతోటి ప్రాంతీయ భాషా ప్రజలు నేర్చుకునేటట్టు చేయడం వివేకమైన పని. దానితోపాటే హిందీని అనక్తిగా నేర్చుకునే విద్యార్థికి మాతృభాషపట్ల అలసత్వం ఏర్పడని విధంగా విద్యావిధానం వుండాలి. హిందీని జాతీయ భాషగా గుర్తించటానికి ఇంకో ఏభై ఏళ్ళ గడువు అవసరం. అప్పటికి హిందీగూడా ఇప్పటికంటె ఎక్కువ సాహిత్య పరిపుష్టంగానూ, వివిధశాస్త్ర పరిపుష్టంగానూ ఉండగలదని- మనం ఆశించవచ్చును. ఇప్పటి స్థితిలో ఎస్. కె. పాటిల్‌గారన్నట్టుగా ఆంగ్లాన్ని కాదని, హిందీని అమాంతం ప్రవేశపెట్టాలని చూడడం పిచ్చి పని. పైగా అది ప్రాంతీయ భాషాప్రజల కోపతాపాలకూ గురవుతుంది. కేంద్రప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తిస్తుందా సకాలంలో! లేకపోతే ఆంధ్రులూ ఆందోళన ప్రారంభిస్తారని తెలుసుకోడం ఉత్తమం.



సంగీత నాటక అకాడమీవారు ఇటీవల ఢిల్లీలో నాటక ప్రదర్శనల పోటీ ఏర్పాటు చేశారు. దీంట్లో ఉత్తమోత్తమ నటీనటులుగా పరిగణించబడిన కళాకారులకి బహూకరించబడిన రాష్ట్రపతి అవార్డు నమూనా.

స్కెచ్:

# చంపుకున్న కోర్కెలు

++++++++ రచన ++++++++

'జీవన్'

శివరాత్రినాడు బయల్దేరాను "కాళీపహాడ్"కి-అంటే బీహార్ రాష్ట్రంలో జమాల్‌పూరనే కార్మిక కేంద్రంలోని పర్వతపంక్తికది నామదేయంలెండి. అక్కడ శివరాత్రినాడు జాగారాలూ, మర్నాడు పెద్ద సంబరమూ జరుగుతాయి. ఈ సంబరాలకి మంచి మట్టి బొమ్మలు, రంగులు వేసినవి అమ్ముతారు. టేబిలుమీదికొక అందమైన బొమ్మ యేదన్నా కొనాలని బయల్దేరాను సాయంత్రం నాలుగ్గంటలికి.

త్రోవలో శాస్త్రిగారు కనబడి "ఈవాళ ఆంధ్రసంఘం మీటింగు వుందిప్పుడు మీరు రారా?" అన్నారు. "వస్తానండి. ఇలా ఒక్కసారి తిరిగి మరీ వస్తాను." అని చెప్పి బయల్దేరాను. ఏ బొమ్మ కొనాలెనని ఊహించుకుంటూనే నడిచి వెళుతున్నాను. ముందు పర్సు చూసుకున్నాను. అసలు బడ్జెట్‌ను బట్టేగా క్రయవిక్రయాదులు! ఫర్వాలేదు. అయిదురూపాయల నోటొకటీ, పదిహేనణాలవరకూ చిల్లరా వున్నయ్.

కాళీపహాడ్‌కు వెళ్తూన్నవాళ్ళూ, తిరిగి వస్తూన్న వాళ్ళూ జనసందోహం అధికంగా వుంది. కొండదిగువను బొమ్మల దుకాణాలున్నయ్. మంచి శిల్పంతో కూడిన రకరకాల బొమ్మలున్నాయి.

మొట్టమొదటి బొమ్మలవేపు చూడగానే నా దృష్టి "రాధాకృష్ణలీల" బొమ్మ మీదికి పోయింది. ఆ ముగ్ధమోహనమూర్తి మురళి వాయిస్తూంటే తన్మయత్వంలోకరిగి అతన్ని పెనవేసుకున్న రాధచేయి అతని గుండె మీద- "మనమిద్దరమూ ఒకటే సుమా" అన్నట్టు వేసి వున్నది. ఎంత చక్కగా చేశాడు శిల్పి! అందుకే మన దేశం శిల్పానికి పేరు పొందిందనుకున్నాను. "నాయనా! ప్రేమమయమీ జగమూ....! ఉన్న నాలుగురోజులూ హాయిగా, ఉల్లాసంగా వుండడం అలవరుచుకో! చిన్నప్పటినుంచీ నేను గోపికలతో చేసిన ప్రేమ కలాపానికి పరిపక్వదశ యీ "రాధాకృష్ణలీల" అన్నట్టుగా వున్నదా బొమ్మ. ఈ బొమ్మ కొనాలె: సుబ్బారావుగారి బొమ్మను చూసి— "ఏమయ్యా! ఇలాంటి రాసక్రీడల బొమ్మ కొన్నావ"ని అడిగితే సమాధానం కూడా ముందుగా ఊహించి సిద్ధపరచుకున్నాను. "వయసుతో బాటు భావాలూ పరిణతి చెందడం స్వాభావికం గదండీ! కౌమారంలో ఆ అభిరుచులకు చెందిన బొమ్మలూ, యవ్వనంలో తదను గుణ్యమైన బొమ్మలూ కొనుక్కోవాలని బుద్ధి పుట్టడం సహజమేనంటూ" మనమే యెదురుప్రశ్న వేస్తే సరిపోతుందని వెంటనే కొనేద్దామనుకున్నాను. కాని ప్రక్కనే వున్న "కోతి" బొమ్మ వెక్కిరించినట్టు చూసింది. "తొందర పడబోకు. స్థిమితంగా అన్ని దుకాణాలూ చూసి మరీకొను" అన్నట్టు వెక్కిరిస్తోంది కోతిబొమ్మ.

ప్రక్క దుకాణానికి వెళ్లాను. అక్కడున్న బొమ్మల్లో కమలాసనంపై వీణాపాణియైయున్న సరస్వతీదేవి బొమ్మ చాలా బావుంది. ఆ హంస, ఆకమలం, ఆ వీణ ఎంత చక్కగా చేశాడో! "అబ్బాయ్! నా కటాక్షమేలేకపోతే నీ వింత దూరం రావటమూ, ఇలాంటి సంబరాల్ని చూడటమూ తటస్థించకపోయివుండేది. అంచేత నాబొమ్మకొను" అన్నట్టుగా మందహాసం చేస్తున్నది మన్మధమాత. మిగిలిన దుకాణాలుకూడా చూసి ఆఖరున కొందామని మరోకొట్టుకి దారితీసాను.

ఒక్కొక్క దుకాణంలో ఒక్కొక్క రకపు బొమ్మ నన్నాకర్షిస్తూన్నది. మూడో దుకాణంలో "భారతపిత" మహాత్ముని బొమ్మ నాకు నచ్చింది. "నాయనా! అనవసరంగా మట్టి బొమ్మలకెందుకు తగులబెడతావు డబ్బు! అదుగో అటు చూడు కొండమెట్లమీద ఎందరో క్షుదార్తులు అలమటిస్తున్నారు. వారికి దానంచెయ్యి. "అని మహాత్ముడు ప్రబోధిస్తున్నట్లనిపించింది నాకు.

మరో దుకాణానికి వెళ్లేంతలోనే— "బాబూజీ! ఏక్ పైసా దీజియే. అఫకా మెహర్బానీ హోగా! తీన్‌దిన్‌సే భూఖా హూఁ!" అంటూ వికలాంగయైన ముసలవ్వ అడుగుతున్నది. నా "బొమ్మ" క్రయకర్మ పూర్తయేంతవరకూ యేవిధంగానూ ఖర్చు పెట్టగూడదని నిశ్చయించుకున్న నేను—"జావ్, జావ్" అంటూ తప్పుకున్నాను.

ఆ తరువాయి దుకాణంలో వున్న బొమ్మ "మాతృమూర్తి". దిగువనుండే తల్లి ఒడిలోనికెగుర ప్రయత్నించేబిడ్డడు. వాత్సల్యంతో బిడ్డతల నిమురుతూన్న "మాతృమయి" మాతృ మమత గురించి కథలు వ్రాసే నువ్వు అందుకు చిహ్నంగా యీ బొమ్మ కొనలేవా?" అనడుగుతూన్నట్టున్నదా బొమ్మ. తెలుగునాడు వదలి వచ్చిన తరువాత "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే శ్లోకాంతరార్థం గ్రహించిన వాళ్ళల్లో నేనొకణ్ణి!

ఆ బొమ్మ ప్రక్కనే వున్నది శాంతమూర్తి బుద్ధ భగవానుని విగ్రహం. ప్రఫుల్ల నిశ్చలవదనమేదో సందేశమిస్తున్నట్టుగా వున్నది-"నాయనా! ఈ లోకంలో దుఃఖాలన్నిటికీ కారణం కోరికలే! కోర్కెలు నశించనంతవరకూ ప్రపంచంలో దుఃఖమనే వస్తువు నాశనం కానేరదు. ఉదాహరణకి బొమ్మ కొనాలనే నీ కోరికే నిన్నింతవరకూ యీడ్చుకువచ్చింది చూశావా! కోర్కెల్ని చంపుకోవాలి. ఆ నాడే యిహంలో కూడా శాంతి, సౌఖ్యాలు" అనే ప్రబోధం బుద్ధుని సందేశంగా నామనస్సులో తొణికిసలాడింది.

"నిజమే! బుద్ధభగవానుడు చెప్పింది అక్షరాలా వాస్తవం. బొమ్మ కొనాలనే కోర్కెను చంపుకుంటే డబ్బు మిగులుతూన్నది. శ్రమా తప్పుతున్నది." ఈ నిశ్చయంలో, ఆ కోర్కెను చంపుకున్నట్లే! అలా ముందుకువెళ్ళి తిరిగి వద్దామని పురోగమించాను.

మరోచోట రియల్‌ఆర్టు పేపరుపైన ముద్రింపబడిన గొప్ప ఆర్టిస్టు "ముల్‌గాంకర్" బొమ్మలు నన్నాకర్షించాయి. కొద్దిగా కళాపిపాస....పెద్దమాట.... కళాసంబంధమైన ఉత్సాహం వుండడంచేత అక్కడికి వెళ్ళాను. ముల్‌గాంకర్, రామకుమార్, వడ్డాది పాపయ్య, చిత్రాగార్ల బొమ్మలంటే చెవికోసుకునేవారి వరుసలో నేను ముందు నిల్చుంటా. ఆ కారణంవల్లి,

(మిగతా 22 వ పేజీలో)